

# ఆకాశవాణి

## సంగీత సమీక్ష...

"పరుసవేది"

సోమవారం, 18-12-50

### ఈదర నాగరాజుగారి గానం

నేడు గౌరీ మనోహరి, హిందోళా రాగాలు అవలీలగా సంచరిస్తూ ఆలాపన చేశారు. స్వర స్థానములపై స్వాధీనత సంపాదించిన తర్వాత రాగాల ఆయువుపట్లు గమనించి వీనులకు హాయి గొలిపే రీతిని నయమార్గాన గానం చెయ్యడానికి ప్రయత్నించాలి గాయకులు. సంగీత విద్యలో ప్రతిభకంటే రక్తికి ఎక్కువ చోటివ్వాలి.

గురువారం, 21-12-50

### జూలూరి అరుంధతీదేవిగారి గానం

వీరివలె రక్తిగా, గమక శుద్ధంగా రేడియోలో పాడుతూన్న స్త్రీలు కనబడడం కష్టం. ఈమె పాడుతూ ఉన్నంతసేపూ శ్రద్ధగా వినాలనే కుతూహలం తగ్గలేదు. రవ్వజాతి సంగతులు బహుళముగా పలికించడానికి ప్రత్యేక కృషి చేస్తే వీరిపాట వన్నెకెక్కి గొప్పపేరు సంపాదిస్తుంది.

### ముడికొండాన్ వెంకటరామయ్యరుగారి గానం

మద్రాసునుండి సురటిరాగం, తానం, పల్లవి పాడారు. సాధారణముగా సావకాశంగా విన బడని సురటి రాగాన్ని వీరు విపులముగా, రస భరితముగా, అతి నేర్పుతో ఆలాపన చేశారు. వీరి తానపోకడలు సురటి రాగములో అందముగా ఉన్నాయి, స్వరకల్పనకు తావు ఇవ్వకపోవడం పెద్దలోటుగా కనిపించినది,

మంగళవారం, 26-12-50

### డి. కె. పట్టమ్మాళ్‌గారి గానం

వనితాలోకంలో వీరి గానం సంప్రదాయ శుద్ధము, ఆదర్శప్రాయము అయినది, ఈమెవలె గమకయుక్తమైన బాణీ మరొక విద్వాంసురాలు ప్రచారము చెయ్యడంలేదు. సంగీత విద్యార్థినులు వీరి బాణీ ననుసరించడానికి ప్రయత్నం చెయ్యాలి.

బుధవారం, 27-12-50

### అరియకుడి రామానుజయ్యంగార్ గానం

నేటికాలపు సంగీతయోధులలో భీష్మునివంటి గాయకుడీయన, కర్ణాటక సంప్రదాయమీయన గానంలో ఉట్టిపడుతుంది ప్రతిక్షణమూ, గంభీర మైన గాత్రము, ప్రాచీన సంప్రదాయ సిద్ధమైన శైలి, సుందరతరమైన మనోధర్మశక్తి, కల్పనలో యుక్తాయుక్త విచక్షణ - ఈ సులక్షణములన్నీ వీరి గానములో మూర్తీభవించి ఉన్నాయి. వీరి కచ్చేరిలో నందీశ్వరుని అవతారమని చెప్పదగిన పాల్‌ఘాటు మణి అయ్యరుగారు కృష్ణార్పణముగ మృదంగగానం చేశారు, "ఎందరో మహాను భావులు" అనే కీర్తనకు మణిఅయ్యరుగారి మృదం గానుసరణ వర్ణనాతీతంగా ఉంది.

గురువారం, 28-12-50

### మధురమణి అయ్యరుగారి పాట

పాల్‌ఘాటు మణి అయ్యరుగారి మృదంగం కచ్చేరీకి మధుర మణి అయ్యరుగారి పాట ఊత గానికి తెప్పవలె పనికివచ్చింది. గమకపూరితమైన

సంప్రదాయ కర్ణాటక సంగీతము వర్ధన్నా చెవిని బడుతూండే దక్షిణ దేశంలో పుట్టి పెరిగిన మధుర మణిగారికే గారిడీబాణి ఎట్లా అలవాటైనదో ఆంధ్రదేశములో సంగీత ప్రపంచమున కాలు పెట్టనున్న యువకులు పొరబాటునైనా పెడ దారులు తొక్కకుందురుగాక.

శుక్రవారం, 29-12-50

## టి ఎన్. బాలసుబ్రహ్మణ్యముగారిగానం

అనుపమానమైన గాత్రసంపదతో సంగీత ప్రపంచము నలంకరించిన వీరు విజయవాడనుండి తోడి రాగాలాపనచేసి పల్లవి పాడారు. తోడి రాగం ఎప్పటికంటే రసవంతముగా ప్రదర్శించారు. రామస్వామిగారు అతి నేర్పుతో ధైర్యంగా అనుసరించారు.

ఆదివారం, 31-12-50

## ఎమ్ ఎస్. సుబ్బలక్ష్మిగారి గానం

వీరి గాత్రములో ఎప్పటి మాధుర్యము కాన వచ్చినట్లులేదు. కాని రాగాలాపనలు - ముఖ్యముగా కామవర్ధని - ఈమె కల్పనా శక్తిని కొంచెము చాటినవి. నూతన కల్పనపై ఇంకా శ్రద్ధతో ఈమె గానం చేస్తే నిజమైన కోకిల గానం వినగలం. కల్పాతి రామనాథన్ గారు విజృంభించి మృదంగ వాద్యంలో తమచేతివాటం ఎక్కువగా ప్రదర్శించారు.



1950 దశకంలో ఆనందవాణి అనే పత్రికలో " ఆకాశవాణి - సంగీత సమీక్ష " శీర్షికతో ప్రచురించబడ్డ వ్యాస పరంపరలోని కొన్ని వ్యాసాలు ఇక్కడ చూడవచ్చు.

ఇలాటివి, మరియు ఆకాశవాణికి సంబంధించిన ఏ చిన్న భాగం అయినా, అది ఆడియో అవ్వొచ్చు, ఫోటో అవ్వొచ్చు, వ్యాసం అవ్వొచ్చు, మరేదైనా అవ్వొచ్చు, అవి మీ వద్ద వుంటే పంచుకోగలరని ఆశిస్తూ....

కాపీరైటు హక్కుల ఉల్లంఘన ఉద్దేశం లేదనీ, లాభాపేక్ష / ధనార్జన ఉద్దేశమంతకన్నా లేదనీ సవినయంగా తెలియచేసుకుంటూ - ఈ వ్యాసాలు ఇక్కడ, ఇలా రేడియో అభిమానులకు అందుబాటులో ఉంచటానికి అభ్యంతరాలు ఎవరికైనా ఉంటే తప్పక తెలియపర్చండి. క్షమాపణలతో వెంటనే తొలగిస్తాను.

భవదీయుడు

మాగంటి వంశీ మోహన్

http://www.maganti.org/